


"ఏమైనా సరే నే కథ రాయాలి" అనిపించింది నాకు.

లేకపోతే లాభంలేదు. బొత్తిగా అన్యాయంగా ఉంది. నిన్న మొన్నటి కిష్టిగాడు 'చూసుకో నేనో కథ రాశానంటూ' తీసుకు వస్తాడూ? వెలెడంతలేదు, వీరిగాడు కూడా ఒక వస్తాదా? స్కూలు ఫైనలు మూడో దండయాత్రకి సిద్ధంగా ఉన్నాడు చెంచయ్య కూడా ఓ కథ కుదే! ఆఖరికి సుధ—నిన్న మొన్నటి దాకా 'బావా తైమెంత?' అంటూ 'ట' కూడా సరిగ్గా పలకలేకుండా ఆఘోరించిన సుధకి—కథల పోటీలో బహుమతా?

రామ రామ! వీళ్ళంతా ఈ కథా ప్రపంచంలో హేమాహేమీలుగా చలామణీ అయిపోతూంటే, వీళ్ళ కంటే కాస్తో కూస్తో నాల్గో ముక్క ఉన్నవాడిని, దాదాపు నాలుగైదేళ్లు పెద్దవాణ్ణి, బి. ఏ. చదువుతూ ఝూంమ్మని ఇంగ్లీషు, తెలుగు రెండింటిలోనూ ఫస్టుమార్కు తెచ్చుకుంటూ ఉభయ భాషా ప్రవీణుడిగా, ఉభయ ఉపన్యాసకులద్వారా మెప్పు పొందుతున్నవాణ్ణి, నేను, ఏమీ చేతకాని వాడిలాగ చేతులు ముడుచుకుని కూచోడమా? అదేదో మహా విద్య అయినట్లు అందరూ ఆశ్చర్యంగా చూస్తూంటే, నేను కూడా నోరు వెళ్ళబెట్టుకొని చూడడమా?

ఛ...ఛ...ఇదేం బాగోలేదు. నేనూ రాసేస్తా ఓ కథ. నాకు మాత్రం వాళ్ళలాగ చేతుల్లేవా, పెన్నూ కాగితాలూ లేవా? రాసెయ్యాలి. ఏమైనా సరే కథ రాసెయ్యాలి. అయితే మంచి కథకి ఈ పాత పెన్నూ, చిత్తు కాగితాలు లాభంలేదు. కొత్తవి కావాలి. ఇలా ఓ నిశ్చయానికి రాగానే వెంటనే బజారుకెళ్ళి ఓ ఖరీదైన పెన్నూ, నాలుగు దస్తాల తెల్ల కాగితాలూ, నాలుగైదు డజన్ల ఫ్యాన్సీ కవర్లూ, వగైరా కావలసిన సామానంతా తీసుకుని ఇంటికి వచ్చాను.

టేబిల్ ముందు కూచుని ఇష్ట దేవతా ప్రార్థనచేసి, వీరిగాడు, కిష్టిగాడివంటి కుకథకుల నిందా, బాల్‌జాక్, ఓహెన్రీలవంటి సుకథకుల స్తుతిచేసి అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా చెప్పంబూనిన నూతన కథాక్రమం బెట్టిదనిన—

"ఏమిట్రా గంటున్నరయి కుర్చీకి అలా అతుక్కు పోయావ్? ఏవిటా వెధవ చదువు? ... వడ్డించాను లే—భోంచేద్దువుగాని" అంటూ గట్టిగా అరచింది అమ్మమ్మ.

ఈ కేకలకి హడలిపోయి, నా 'మూడ్' కాస్తా ఎగిరిపోయింది. ఛ—ఈ ముసలాళ్ళకి బుద్ధి ఉండదు. ఎప్పుడూ తిండి తిండి తిండి —ఇప్పుడు చూడు. బంగారంలాంటి కథ కాస్తా ఎలా కరిగిపోయిందో – చెదిరిపోయిన కథ తాలూకు అవయవాలన్నీ ఓ చోటుకి పోగుచేసి సూదీ దారంతో కుట్టడానికి ప్రయత్నం చేస్తుంటే, "ఏరా – వినిపించటంలే? ఇక్కడ ఈగలు ముసిరి పోతున్నాయి. నువ్వు వస్తావా, నేను లేచివచ్చి ఆ కాగితాలన్నీ ఉంగచుట్టి అవతల పడేసేదా?" అని ఇంకో అరుపు అరిచింది అమ్మమ్మ.

అంతపని చేసినా చెయ్యొచ్చు ఆవిడ. ఇంక లాభం లేదు. ఏదో కాస్త ఎంగిలిపడి వచ్చేస్తే ఆ తర్వాత నిమ్మితంగా కథ రాసుకోవచ్చు. ఓ పక్కనుంచి ఈవిడ గొడవ పెడుతూంటే కథ నడవడం కల్ల. అందుకే ఋషులు అమ్మమ్మలూ వాళ్ళూ లేని అరణ్యాల మధ్యకిపోయి ఇంచక్కా కథలు చెప్పుకుంటూ ఉండేవారు నిజానికి కథ రాసుకొనే ప్రతీ 'సూతు'డికీ ఒక నైమిశారణ్యం కావాలి! ఆ కనీస అవకాశమైనా లేకపోతే కమ్మని కథలు రాయడం కష్టం.

భోజనం చేస్తున్నంతసేపూ నా మెదడులో ఎన్నో ఆలోచనలు ఈగల్లా ముసరసాగాయి. అమ్మమ్మ అరిచిన తర్వాత కథ ముందుకు సాగలేదు. సరే, బాగానే ఉంది. అరవక ముందు

పి. రాజ్యలక్ష్మి

అరవైనిమిషాలు పైగా కేబిల్ ముందు కూచున్నాను కదా - ఏం సాగినట్టు? అంటే కథ చకచకా నడవడానికి బాహిరమైనవి కావన్న మాట ముఖ్యమైన ఆటంకాలు. మరి? కథ రాయలేక పోయామంటే మన లోనే లోపం ఉందన్నమాట! ఎందువల్లో అందుకు ఒప్పుకోడానికి మనస్సు కొంచెం మొహమాటపడింది. నాలో ఏం లోపం ఉంది?... తక్కిన కథకులికి నేను ఏం తీసిపోయాను?


ఆ, అర్థం అయింది. వాళ్ళంతా ఏదో ఊహాలోకంలో తేలిపోతూ ఉంటారు. ఏ చిన్న సంఘటన చూసినా అహో! ఓహో! అంటూ తబ్బిబ్బు అయిపోతూ ఉంటారు. ఓ మోస్తరు ఉదాసీనత, చిన్న సైజు పరధ్యానం నేను కూడా ప్రారంభించాలి. అసలు ప్రపంచ విషయాల్లో పరధ్యానం తెచ్చుకుంటేనే కాని కావ్య ప్రపంచంలో పరాకాష్ఠ నందుకోలేరు ఈ పర ధ్యానంతోపాటు ప్రకృతిలో తన్మయం అవడం కూడా నేను కొంచెం నేర్చుకోవాలి.

అమ్మమ్మకి బాగా కునుకు పట్టిందని నమ్మకం కుదిరాక, రాత్రి పది గంటలకి వీధి తలుపు బార్లాతీసి, లోపల పడుతూన్న వెన్నెలని చూస్తూ ఆనందించ సాగాను హమ్మయ్య! నిశ్శబ్దంతోపాటు ప్రకృతి సౌందర్యం కూడా లభించింది. ఇంక తప్పకుండా కథ రాసెయ్యొచ్చు. బ్రహ్మాండమైన — లోకం అంతా ఓహో అనే కథ—కిష్టిగాడూ వీరిగాడూ వీళ్ళంతా చూసి పైకి మెచ్చుకోలేకపోయినా లోపల ఈర్ష్యపడే కథ—

రైట్. కథ ప్రారంభించవచ్చు.

బయట వెన్నెల కాస్తోంది. వెన్నెట్లో అందమైన పుష్పాలుంటే బావుండును. ఆ—సన్నజాజి, మల్లె, చామంతి, బంతి—ఏదీసినట్టుంది. మల్లె ఏప్రిల్‌లో పూస్తుంది. బంతి సంక్రాంతికి విడుస్తుంది. తక్కినవి ఏయే కాలాల్లో పూస్తాయో మనకి తెలియవు. అందువల్ల కథలో పుష్పాల ప్రస్తావన చెయ్యడం అంత తెలివైన పనికాదు, పోనీ "బాలభానుడు అస్తాద్రిని చేరుచున్నాడు" అని వర్ణిస్తే. అవును అది బాగుంది. కానీ - "వెన్నెల కాస్తున్నప్పుడు సూర్యాస్తమయం ఏవిట్రా విచ్చికన్నా" అంటే, ఛట్ - బాగోలేదు. వెన్నెలేనా కాయాలి, బాలభానుడేనా కాయాలి. ఆ కాయలంటే జ్ఞాపకం వచ్చింది. "రంగడికి జామకాయలంటే ప్రీతి". పోనీ ఇలా మొదలెడితే కథ? ఊఁ!... సరే... తర్వాత ఏవిటో - నా మొహం... ఇలా తర్కించుకుంటుంటే కథ వస్తుందేవిటి? రాసుకుపోవాలి కాని. తెల్లని కొంగలు బారులు బారులుగా ఆకాశంలో ఎగురుతున్నాయి. చల్లని పిల్ల తెమ్మెరలు వీచుచున్నాయి. ఎదురుగా గోదావరి అభిసారికలా నడుస్తూ...





"అమ్మో- నా వేపు ఎవరో నడుస్తూ వస్తున్నారు" అంటూ గట్టిగా అరిచి రెండు చేతుల్తోటీ కళ్ళు మూసుకున్నాను.

నిద్దట్లోంచి అమ్మమ్మ మాకంగారుగా లేచి కర్ర తీసుకుని నా కెదురుగుండా బార్లా తీసిఉన్న వీధిగుమ్మం దగ్గరకి వచ్చింది. ఉన్నట్టుండి గట్టిగా నవ్వి, "తెలివి తెల్లవారినట్టే ఉంది. ఎవరిదో గేదె, తాడు తెంపుకుని వచ్చింది. దాన్ని చూశా ఈ భయం? అసలీ అర్థరాత్రివేళ తలుపులు తీసుకుని కూర్చోమన్న దెవరు? లైటు ఆర్పేసి పడుకో" అంటూ ఒక్క కసురు కసిరి, తనే తలుపు వేసేసి లైటు ఆర్పేసి వెళ్ళిపోయింది.

నా తలపుల తలుపులు వేసేసినట్లూ, నా కథా రచనా జ్యోతి ఆరిపోయినట్లూ బాధపడ్డాను. కిటికీలోంచి పడుతూన్న వెన్నెలని చూస్తూ, నేను రాయబోయే కథ గురించి ఆలోచించుకుంటూ నిద్రపోయాను కొంతసేపటికి.

తర్వాత "ప్రారంభించి పరిత్యజింతురురుః ఘ్నాయత్తులైమధ్యముల్" అన్నట్లు ఒక నెలదాకా కథ రాసే ప్రయత్నమే మానేశాను. ఆ మానెయ్యడం మానెయ్యడం పూర్తిగా మానేద్దును. కాని పరాంకుశం నాలో తిరిగి ఈ చైతన్యాన్ని కల్పించాడు.

వాడు కాలేజీ మేగజైన్ ఎడిటోరియల్ బోర్డులో మెంబరయ్యాట్ట. ఎడ్వయిజరుగా ఉన్న వైస్ ప్రిన్సిపాలుకి వీడు ఎంతచెబితే అంతేట. అందువల్ల నన్ను ఓ కథ రాయమన్నాడు. పైగా "ఆ కిష్టిగాడికంటే, వీరిగాడికంటే తీసిపోయా



వేమిటి ? వాళ్ళప్పుడే రెండుకథలూ ఇచ్చేశారు' అన్నాడు...

'అహ ! అప్పుడే రాసెయ్యడం, ఇచ్చెయ్యడం కూడా అయిందీ ?... అసలు ఛాన్సు ఎప్పుడు దొరుకుతుందా అనికూచున్నారన్న మాట!... ఊ... ఇంతకీ వాళ్ళకథల పేర్లేవిటి?' అన్నా.

'ఆc! ... ఒకటి 'మధుహృద' కాబోలు. రెండోది 'వ్యథానిధి' అన్నాడు పరాంకుశం.

'అద్గదీ- అలాచెప్పు. శీర్షికలో 'థ' అనే అక్షరం విధిగా రావాలన్న మాట. శీర్షిక నాలుగు అక్షరాల్లో ఉండాలన్నమాట ! వాళ్ళ రహస్యం నాకు తెలిసి పోయిందిలే- ఇంక నేనూ రాసేస్తాను ఓ కథ' అన్నాను.

'ఎల్లుండి ఆఖరి రోజు'

'ఎల్లుండి ఎందుకు ? రేపటికి ఇచ్చెయ్యనూ ? అప్పుడే శీర్షిక నిర్ణయం అయిపోయింది 'సుధకథ'. అసలు కిటుకు దొరికి పోయిందిగా ? ఇంక కథ రాయడం ఎంతా ?'

ఆ సాయంత్రమే ఊరికి బాగా మైలు దూరంలో ప్రశాంతంగా ఉన్న ఒక తోటలోకి వెళ్ళి కూర్చున్నా. చుట్టూ కొబ్బరి, అనాస, జామ, మామిడిచెట్లు చూడ్డానికి ఎంతో అందంగా ఉన్నాయి. చిలకలు జామి పళ్ళు కొరికి కిందపడేస్తూ చక్కగా ఒకదానితో ఒకటి వాట్లు తియ్యని భాషలో మాట్లాడుకుంటున్నాయి.





ఉండుండి దూరంగా మామిడీ చెట్టు మీంచి కోకిల అరుస్తోంది ! ఆహా ! ఎంత చక్కని వాతావరణం ! కథ రాయడానికి ఎంత చక్కని సామగ్రి దొరికింది ! నా కథలో కోకిల గురించి కూడా రాయొచ్చు. మహా కవు లెవ్వరూ కోకిల గురించి రాయకుండా మానలేదు.

మహా కవులంటే జ్ఞాపకం వచ్చింది. కాళిదాసు ఎంత గొప్ప కవి ! ఆయన శాకుంతలం, మేఘసందేశం గొప్ప కావ్యాలంటారు. బహుశా ఆయనా తనకావ్యాల్ని ఇలాంటి అందమైన తోటలోనే కూర్చుని రాసి ఉండాలి. నేనూ అహం కాళిదాసులా 'సుధ కథ'ని రాసేస్తా.

ఈశీర్షిక మాబాగా ఎన్నుకున్నాను కదూ? ఇటు కావలసిన 'థ' వచ్చింది. అటు మా మరదలు సుధ పేరూ వచ్చింది. దాన్ని నాయికను చేసి, నేను నాయకుడనై ఆ కథరాయాలి. అందులో అది ఓడిపోయినట్లూ, నేను విజయం సాధించినట్లూ రాస్తే ఇంక చూసుకో- ఎంత ఏడుస్తుందో. ఏడవవలసిందే. లేకపోతే తానే గొప్ప దాన్నయినట్లు కథలు రాయడం, బహుమతులు సంపాదించడం, అక్కడికి తక్కినవాళ్ళెవళ్ళూ తనకి చాలరన్నట్లు గర్వంగా అందరికేసీ మాడ్డం. దాని గర్వం ఏవిటో ఈ మాటుతో తేలిపోవాలి ! నాకథ చదివేసరికి దానితల తిరిగిపోయి గర్వం అంతా దిగిపోవాలి. చూస్తా. తానొక్కత్తే కథ రాయగలననుకుంటోంది. అది కాదనీ దాని ఆలోచన తప్పనీ నిరూపించాలి. ఏమైనా నేను కథ రాసి తీరాల.

ఓ చిత్తు కాగితం తీసి విఘ్నేశ్వరా సరస్వతీ వెంకటేశ్వరా అనిమూడేసి సార్లు రాసి కళ్ళకద్దుకున్నాను. నెల్లాళ్ళ క్రితం కథ రాయబోయే ముందిలా దేవుళ్ళ పేర్లు రాసిన జ్ఞాపకంలేదు. అందుకే కథ నడవలేదు. ఏదో ఒక అడ్డంకి వచ్చింది. ఇప్పుడా భయంలేదు. దేవుళ్ళపేర్లు రాసేశానుగా ? కథ చకచకా సాగిపోతుంది.

కాగితాలు ఒక మారు కుదించి అందంగా బొత్తిపెట్టి 'పిన్' చేశాను. 'సుధకథ' అని పెద్దక్షరాలతో ఎర్ర సిరాతో హెడ్డింగు పెట్టి అందంగా నల్లసిరాతో షేడ్ ఇచ్చాను. అక్రింద గుండ్రంగా నా పేరు రాశాను. రాయబోయే కథకి అలంకారాన్నీ, అందాన్నీ కూర్చేలా, ముచ్చటగా తయారయింది హెడ్డింగు.

ఇంక కథే మొదలెట్టాలి. మెదడులో ఎన్నో ఆలోచనలు ఉన్నాయి. ఎంతో అందమైన ఇతివృత్తం ఉంది. చక్కని భాష ఉంది. నిజంగా నా మనస్సుని చదవగలిగిన పాఠకుడే ఉంటే, నన్ను ఆకాశానికి ఎత్తి ప్రపంచ కథానికా రచయితల శ్రేణిపైన కూర్చోపెట్టి ఉండును... అంత గొప్పకథ మెదడులో ఉండికూడా కాగితంమీద ఏమీ పెట్టలేక పోతున్నా. అథవా, ఒకటి రెండు వస్తువేవో రాసినా, అవి నా భావంలో ఉన్న బరువుని తేలేక పోయాయని ఇట్టే తెలిసిపోతోంది. ఇలా ఎందుకు జరుగుతోంది.

ఆలోచించే మెదడు నాదే. రాసే చెయ్యి కూడా నాదే!... ఈ రెండింటికీ పొంతన ఎందుకు కుదరడం


నేను చూచిన అమెరికా
రచన : అక్కినేని నాగేశ్వరరావు
[ప్రసిద్ధాంధ్ర చలనచిత్ర నటుని అమెరికా యాత్రానుభవాలు]
32 పేజీల ఛాయాచిత్రాలతోసహా 128 పేజీలు
సాధారణ ప్రతి రు. 2-50 | లైబ్రరీ ఎడిషన్ రు. 3-50

కూనలమ్మపదాలు [ఆరుద్ర రచన]
వెల : రూపాయి

రసికజన మనోభిరామం
[పదే పదే నవ్వదగిన జోకులు, కార్టూన సంకలనం]
వెల : రూపాయి

జ్యోతి బుక్స్, విజయవాడ-2
చిరునామాకు వ్రాయండి.
[లేదా మీ వూరిలోని "జ్యోతి" ఏజెంట్ ద్వారా తెప్పించుకోండి.]




లేదూ?... ఆఁ! బహుశా ఈ లోటు అంతా 'పెన్ను'ది అయి ఉంటుంది. నెల్లాళ్ళ క్రితం బోల్డు డబ్బుపెట్టి కొన్నాను. ఖరీదు అయితే ఉంది కాని, కవిత్వం రాసే అలవాటు, సామర్థ్యం ఉండొద్దూ? లక్షలకి లక్షలు డబ్బున్న వాళ్ళల్లో తెలివితేటలు లేని వాళ్ళు ఎంతమంది లేరూ? అలాగే ఈ కలమూను.

అందువల్ల, ఈ కలాన్ని కాదని, కవిత్వం రాయడం అలవాటున్న కలాన్ని సంపాదించాలి. అలాంటి కలం అయితే మన ఆలోచనలని చక్కగా కాగితంమీద పెడుతుంది. ఈ ఊళ్ళో అలాంటి కలం ఉన్న వాళ్ళు ఎవరున్నారు చెప్మా?

ఆ–ఎవర్నో ఎందుకు? సుధనే అడుగుదాం. మొన్న తనకి ప్రైజు సంపాదించి పెట్టిన కలాన్ని ఓమాటు ఇమ్మని. ఈ ఆలోచన రావడం తరవు అవతల వీధిలో ఉన్న మా మావయ్యగారింటికి వెళ్ళాను. సుధ ఊరెళ్ళిందట. రెండు రోజులదాకా రాదట. అలమారంతా వెదికినా దాని కలం కనిపించలేదు.

ఇంతకీ నేను కథ పూర్తిచేసే యోగంలేదు. పరాంకుశం ఆఖరుసారిగా అడిగి వెళ్ళిపోయాడు. నాకు కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది. తర్వాత ఓ రోజున స్టూడెంట్సు కందరికీ మేగజైనులు ఇస్తారని తెలిసి ఆ రోజు శలవుపెట్టి ఇంట్లో కూచున్నా- సాయంత్రం నా ప్రాణానికి యములాళ్ళలా వచ్చారు కిష్టిగాడూ, వీరిగాడూను మా ఇంటికి. వస్తూనే "మా కథలు చూశావురా?" అన్నారు. నాకు బాధ, దుఃఖం ఒక్కసారిగా ముంచుకొచ్చాయి. వాటితోపాటు వాళ్ళమీద అసహ్యంకూడా వేసింది. "నువ్వు చెయ్యలేనిపని మేం ఎంత బాగా చెయ్యగలమో చూశావా?" అన్న గర్వ రేఖకూడా నాకామాటలో గోచరించింది. అందుకే వెంటనే అన్నాను. "ప్చ్... ఆ... వందకథల్లో మీ దొకటి". నా మాట వాళ్ళకి గట్టిగా తగిలినట్టుంది." అహో– అలాగా?. అయితే నువ్వొకటి రాయి చూద్దాం" అన్నారు. "ఆదేం బ్రహ్మవిద్యటరా?" అన్నా. "బ్రహ్మవిద్యో కాదో–నువ్వు కథ రాసి ఏ మంచి కథకుడి చేతయినా ఇది మంచికథ అని అనిపించు. మేం కథలు రాయడం మానేస్తాం. ఏం, ఇదే పందెం" అన్నారు. నాకు వాళ్ళ పందెం చూస్తే పళ్ళు మండుకొచ్చింది. అంతే వీళ్ళ ఉద్దేశం ఏమిటి? నేను కథయినా రాయలేని వట్టి చవటననేకదా? వీళ్ళ కింత కింతా పొగరణచాలి అనుకున్నా.

"సరే. అలాగే. మనకి మధ్యవర్తి ఎవరు?" అన్నా.

"మొన్న ప్రైజు వచ్చిన సుధ" అన్నాడు కిష్టిగాడు.

"నేను ఒప్పుకోను. పత్రికల్లో తరుచు కథలు రాసే వెంకట్రావు గారు."

"సరే. అలాగే కానియ్యి" అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు.

తర్వాత నేను ఎన్ని కథలు చదివానో, ఎన్ని దస్తాల కాగితాలు పాడు చేశానో, ఎన్ని రాత్రులు 'టీ' తాగి మెలకువగా ఉండి ఆలోచనలతో మతి పోగొట్టుకున్నానో లెఖ్ఖలేదు. చూసిన ప్రతి మనిషి మీదా కథ రాయాలనీ, విన్న ప్రతి సంఘటనా కథకి పని కొస్తుందనీ' పుస్తకాల్లో చదివిన ప్రతి వర్ణనా నా కథల్లో ఉపయోగించుకోవచ్చనీ, అవన్నీ ఓ పెద్ద బౌండు బుక్‌లో నోట్ చేశాను. బౌండు బుక్ పేజీలు నల్లబడుతున్నాయి కాని తెల్ల కాగితాలమీద కథ మాత్రం కదలటం లేదు. లాభంలేదు. కథలు రాయడం అలవాటున్న కలం కావాలి. ఓ రోజున వెళ్ళి సుధ కలం "వేరేపిదో పని ఉం"దనీ వంకపెట్టి పట్టుకొచ్చా.

ఆలోచించకూడదు. ఏమొస్తే అది రాసెయ్యాలి. రాసింది ఏ పరిస్థితిలో కూడా కొట్టెయ్యకూడదు. అలాగని కలం ఆపకూడదు. కళ్ళు మూసుకుని రాసెయ్యడమే పని. ఇలా గట్టిగా ఒట్టుపెట్టుకొని మొండిగా మొదలెట్టేశాను.

ఆశ్చర్యం, అర్థరాత్రి దాటకుండా కథ పూర్తి అయింది. నా ఆనందానికి అంతులేదు. నేను కథ రాసేశాను. ఇకముందు ఎన్నోరాసేస్తాను. కథకుడిగా నాకు పెద్దపేరు వచ్చేస్తుంది. అప్పుడు కిష్టిగాడూ వాళ్ళూ... ఆ వాళ్ళ మొహం - ఇంక వాళ్ళేం రాయగలరు? అన్నట్టు పందెం ప్రకారం వాళ్ళు మానెయ్యాలిగా?

మర్నాడు ముగ్గురం వెంట్రావుగారి దగ్గరికి వెళ్ళాం. నేను కథ చదివాను. "నేనూ సుధా చిన్ననాటి స్నేహితులం. పక్కింటి శాస్త్రిల్లుగారింట్లో దొంగతనంగా జామకాయలు కోసుకోవడం, అవి పంచుకోడంలో తగవు లాడుకోవడం మళ్ళీ స్నేహితులం అవడం ఇలా కొన్నాళ్ళు జరిగింది. ఓ రోజున సుధావాళ్ళ నాన్నగారికి ట్రాన్స్ఫరయి సుధ వెళ్ళిపోతుంటే నాకు కోపంవచ్చి 'పో తేపో—నీ జత వచ్చి—ఇంచక్కా వానూ నేనూ జత' అన్నా. సుధ ఏడుస్తూ వెళ్ళిపోయింది. తర్వాత నాకూ ఏడుపువచ్చి వాను జత కూడా మానేశా" ఇదీ కథ. 'ఎలా ఉందండీ' అన్నాను.



వెంకట్రావుగారు ఓ చిత్రమైన నవ్వు నవ్వారు. అంతకంటే ఏం మాట్లాడలేదు. "నిజంగా మంచి కథ కాదండీ?" అన్నా. ఆయన కొంచెంసేపు ఇబ్బందిపడి "కొన్నాళ్ళు ఏదో అలా రాస్తూ ఉండు. ఎప్పటికేనా కథ రాయగలవు" అన్నారు.

నేను ఆ రోజున ఆయనని పెట్టిన ఇబ్బంది ఏమిటో ఇప్పుడు నాకు అర్థమయింది. బాబిగాడు సీసా మూతతో తడి ఇసక నొక్కి అచ్చులు వేసి 'బిసకత్తులు నాన్నా. తిను, తిను' అంటూ గంటనించీ బాధపెడుతున్నాడు నన్ను. పాపం- అప్పుడు వెంకట్రావుగారిని అదే బాధపెట్టి ఉంటాను. ఏమిటో, అప్పటికి ఇప్పటికి కథే రాయలేక పోయాను—ఏదైనా సరే నే కథ రాయాలి

□□□

---

● 'ఒకడు ఊజిప్టు వెళితే అక్కడి వాళ్ళు రెండు పుర్రెలు చూపించి, ఒకటి క్లియోపాత్రా చిన్నప్పటిదని, ఇంకోటి పెద్దప్పటిదని చెప్పారట, ఈ జోకు తెలుసా?'

"తెలియదు; చెప్పు చెప్పు."

● కళ్ళడాక్టరు: "మీకు కళ్ళజోడు అవసరం."

రోగి: "పెట్టుకున్నాగా?"

డాక్టరు: "అయితే నా కవసరం."

● పురిటి గదిలోంచి వస్తూ అత్తగారు: "అమ్మాయికి కవల పిల్లలు పుట్టారని అల్లుడితో చెప్పండి."

మామగారు: 'కాస్సేపాగు. గడ్డం గీసుకుంటున్నాడు.'